సాక్షి అనకాపల్లి

శనివారం । 30 । డిసెంబర్ । 2023



పురస్కారం

విశాఖ: వెంపటి రవిశంకర్ జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రముఖ నాట్యాచార్యుడు డాక్టర్ కృష్ణకుమార్‌కు ప్రదానం చేశారు.



పుస్తకావిష్కరణ

విశాఖ: ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి విన్సెంట్ రచించిన 'ఇంగ్లిష్ ఫ్రేసల్ వెర్బ్స్ విత్ సూపర్ ఈజీ ఎగ్జాంపుల్స్' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు 28.5 నుంచి 29.0 డిగ్రీలు, గాలిలో తేమ 74-77 శాతం, గాలి గంటకు 2 నుంచి 6 కి.మీ. వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

పది, ఇంటర్ ఫీజుల చెల్లింపు గడువు జనవరి 19

అనకాపల్లి : వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పది, ఇంటర్ పరీక్షలకు జనవరి 19వ తేదీ వరకూ ఫీజు చెల్లించే అవకాశం కల్పించినట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.25 అపరాధ రుసుముతో జనవరి 27 వరకూ, రూ.50 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 9వ తేదీ వరకూ చెల్లించవచ్చని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.apopen- school.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

బీటెక్ విద్యార్థులకు ఎంఎస్‌ఎంఈలో శిక్షణ.. ఉపాధి

తుమ్మపాల : బీటెక్ (మెకానికల్) పూర్తిచేసి 18 నుండి 26 సంవత్సరాల వయసు గల యువతీ, యువకులకు అచ్యుతాపురంలో గల ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ ద్వారా ఉచిత శిక్షణ, ఉపాధి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రాజెక్టులో నిరుద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసి మూడు నుంచి ఆరు నెలల పాటు సాంకేతిక శిక్షణతో పాటు ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించబడుతుందన్నారు. శిక్షణ తర్వాత సంబంధిత రంగాలలో ఉద్యోగం కల్పిస్తామన్నా రు. ఆసక్తి గల బీటెక్ నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9492429425 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం



108 అంబులెన్స్‌లో పురుడు పోసుకున్న బిడ్డ

పాయకరావుపేట: సీతారాంపురం గ్రామానికి చెందిన ఎం.హేమ అనే గర్భిణి 108 వాహనంలోనే బిడ్డను ప్రసవించింది. ఆమెకు శుక్రవారం ఉదయం నొప్పులు ఎక్కువగా రావడంతో 108 అంబులెన్స్‌లో పాయకరావుపేట పీహెచ్‌సీకి తీసుకువస్తుండగా వాహనంలోనే ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చించిందని, తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు పైలట్ రాము తెలిపారు. ఏఎన్‌ఎం ఇందిర, ఆశా లక్ష్మి, 108 సిబ్బంది సహకరించినట్లు తెలిపారు.

పదోన్నతిపై ఇద్దరు ఏసీపీలకు బదిలీ

విశాఖ సిటీ: విశాఖలో ఇద్దరు ఏసీపీలకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ద్వారకా ఏసీపీగా ఉన్న ఆర్‌వీఎస్ఎన్ మూర్తి పదోన్నతిపై ఖాళీగా ఉన్న ఇంటెలిజెన్స్ ఏఎస్పీగా నియమితులయ్యారు. అలాగే నార్త్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.శివరామిరెడ్డి కూడా పదోన్నతిపై తిరుమల లా అండ్ ఆర్డర్ ఏఎస్పీగా బదిలీ అయ్యారు.

నర్సీపట్నంలో సామాజిక జైత్రయాత్ర



సభా వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

- మాకవరపాలెం నుంచి నర్సీపట్నం వరకు ర్యాలీ
- భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాల పనుల పరిశీలన
- నర్సీపట్నం అబిద్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ నేడు
- హాజరుకానున్న డిప్యూటీ సీఎంలు బూడి, రాజన్నదొర, మంత్రులు బొత్స, ధర్మాన, అమర్‌నాథ్



నర్సీపట్నంలో సభ జరగనున్న మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా కటౌట్లు



మాకవరపాలెంలో ఏర్పాటు చేస్తున్న కటౌట్లు

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో బడుగు వర్గాలకు జరిగిన మేలును వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికారక బస్సు యాత్ర శనివారం నర్సీపట్నం నియోజకవర్గంలో జరగనుంది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి నేటి వరకు 55 నెలల పాలనలో జరిగిన సామాజిక న్యాయం, బడుగు, బలహీన వర్గాలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. జిల్లాలో మొదటి, రెండు విడతల్లో మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పెందుర్తి, చోడవరం నియోజకవర్గాల్లో విజయవంతంగా సామాజిక బస్సుయాత్ర సాగింది. అంతకు రెట్టింపు ఉత్సాహంతో నర్సీపట్నంలో సామాజిక జైత్రయాత్రలా బస్సుయాత్ర జరగనుంది. ఈ యాత్రకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి హాజరుకానున్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పరిశీలించారు.

బస్సు యాత్ర సాగనుందిలా..

- ఉదయం 11 గంటలకు మాకవరపాలెంలో సామాజిక సాధికార యాత్ర ప్రారంభం కానుంది. అక్కడ నుంచి బైక్, కార్లతో ర్యాలీగా బయలుదేరి భీమబోయినపాలెంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల వద్దకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో పాటు మంత్రులు చేరుకుంటారు
- వైద్య కళాశాల నిర్మాణాన్ని పరిశీలించిన అనంతరం మంత్రులు భీమబోయినపాలెంలో ప్రెస్‌మీట్ నిర్వహిస్తారు.
- ప్రెస్‌మీట్ అనంతరం అక్కడ నుంచి దాదాపు 12 కిలోమీటర్ల వరకు బస్సుయాత్ర సాగుతుంది.
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లంచ్ అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు నర్సీపట్నం అబిద్ సెంటర్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో మంత్రులు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బహిరంగ సభ జరుగుతుంది.

ఏర్పాట్ల పరిశీలన

నర్సీపట్నం: సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. అబిద్‌సెంటర్‌లో వేదిక ఏర్పాట్లను ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుల బొడ్డేడ ప్రసాద్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుయాత్ర మాకవరపాలెం మండలం శెట్టిపాలెం వద్ద ప్రారంభమవుతుందని, వెయ్యి బైకులతో బస్సుయాత్రకు స్వాగతం పలుకుతున్నామన్నారు.

నర్సీపట్నంలో సామాజిక న్యాయం

రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యత కల్పించారు. బీసీ మహిళకు రెండేళ్ల పాటు డీసీసీబీ చైర్‌పర్సన్ పదవి అందించారు. ప్రస్తుతం సంచారక జాతుల డైరెక్టర్, శాలివాహన, కుమ్మరి, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్, పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టర్, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, డీసీసీబీ డైరెక్టర్, మార్కెట్ కమిటీ చైర్మన్ తదితర నామినేటెడ్ పదవులను బీసీలకు, ఒక ముస్లింకు కేటాయించారు. రాజకీయ పదవుల్లో ప్రధానంగా ఎస్సీలకు మున్సిపల్ చైర్‌పర్సన్, గొలుగొండ ఎంపీపీ, నాతవరం జెడ్పీటీసీ, ఎస్టీకి నాతవరం ఎంపీపీ, బీసీలకు మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి, నర్సీపట్నం, మాకవరపుపాలెం ఎంపీపీ పదవులు, గొలుగొండ జెడ్పీటీసీ, మాకవరపాలెం జెడ్పీటీసీ, 8 వైస్ ఎంపీపీ పదవులు కల్పించారు.

వైఎస్సార్‌సీపీ జెండాల రెపరెపలు

సామాజిక సాధికార బస్సు యాత్రతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో వైఎస్సార్‌సీపీ జెండాలు శుక్రవారం మధ్యాహ్నం నుంచే రెపరెపలాడుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున జెండాలు, కటౌట్లను ఏర్పాటు చేశారు.

రూ.2,700 కోట్లతో సంక్షేమాభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 55 నెలల పాలనలో నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.2,700 కోట్లతో సంక్షేమాభివృద్ధి జరిగింది. ఎన్నడూ లేనివిధంగా మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోంది. నియోజకవర్గంలో లబ్ధి పొందిన కుటుంబాలన్నీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలననే మళ్లీ కోరుకుంటున్నాయి. స్కూలు విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు అందరూ జగనన్న ప్రభుత్వంలో లబ్ధి పొందినవారే. నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలంతా సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

– పెట్ల ఉమాశంకర్ గణేష్, నర్సీపట్నం ఎమ్మెల్యే

సంక్షేమ ఫలాల పంపిణీ పండగలా జరగాలి

- కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి



తుమ్మపాల : కొత్త సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను లబ్ధిదారులకు పండగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న కార్యక్రమాలకు సంబంధించి నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రచారం చేయాలన్నారు. సీఎం హామీ మేరకు మొదటి అంశంగా అవ్వాతాతలు, వితంతువులతో పాటు చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, పాదరక్షలు కుట్టేవారు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ బాధితులకు జనవరి 1 నుంచి పెంచిన రూ.3 వేల పెన్షన్ కానుకను అందజేయనున్నట్లు తెలిపారు. రెండవ అంశంగా జనవరి 19న రాష్ట్రంలో ఈ ఐదేళ్ల పాలనలో చేపట్టిన సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనంగా విజయవాడలో నిర్మించిన 125 అడుగుల ఎత్తయిన బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని జనవరి 19న సీఎం జగన్ ఆవిష్కరించనున్నారన్నారు. అదే విగ్రహం ఫోటో ఫ్రేమ్‌లను అదేరోజున అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రతిష్టించి ఉత్సవాలు జరపలన్నారు. మూడో అంశంగా జనవరి 23న చివరి దఫా వైఎస్సార్ ఆసరా సొమ్ము విడుదల కార్యక్రమంపై రెండు విడతలుగా చేపట్టే ప్రచారం, నాల్గవ అంశంగా ఫిబ్రవరి 5 నుంచి 14వ తేదీ వరకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఆర్థిక సహాయం పంపిణీ చేసే కార్యక్రమాలు, అదే విధంగా వలంటీర్లచే సంక్షేమ పథకాలపై లబ్ధిదారులచే రూపొందించిన బెస్ట్ టెస్టిమోనీ వీడియోలను అప్లోడ్ చేయించడం, జనవరి ఒకటి నుంచి రెండో ఫేజ్ 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహణ వంటి అంశాలపై సీఎం సమీక్షించిన అంశాలను కలెక్టర్ అధికారులకు తెలిపారు. జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, ఆర్డీవోలు జయరాం, చిన్నికృష్ణ, ఎస్‌డీసీ డాక్టర్ ఎ.మహేష్, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, సీపీవో జి.రామారావు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు

- ఎస్పీ కె.వి.మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

నర్సీపట్నం : జిల్లాలో గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం రాత్రి నర్సీపట్నం ఏఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా సబ్ డివిజన్‌లో ప్రధాన సమస్యలతో పాటు క్రైమ్ వివరాలను ఏఎస్పీ అధిరాజ్ సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన తర్వాత అనకాపల్లిలో గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించామన్నారు. అల్లూరి జిల్లా నుండి రవాణా అవుతున్న గంజాయిని ఆరికట్టేందుకు ప్రస్తుతం 4 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. మరో ఐదు చెక్‌పోస్టుల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గతంలో గంజాయితో పట్టుబడిన ఇద్దరిపై పీడీయాక్టు నమోదు చేశామన్నారు. అల్లూరి జిల్లాలో గతంలో 7,500 ఎకరాల్లో గంజాయి సాగు చేసేవారన్నారు. ఎస్ఈబీ, పోలీసు సమన్వయంతో దీనిని నిర్మూలించామన్నారు. గంజాయి సాగు చేసే ప్రాంతంలో ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. గంజాయి రవాణాతో పాటు సారా నిర్మూలనపై ఎస్ఈబీ, పోలీసుల సమన్వయంతో ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నామన్నారు. సారా తయారీ, రవాణా గల గ్రామాలు జిల్లాలో 346 ఉండేవన్నారు. ఆయా గ్రామాల్లో పోలీసులు దాడులు నిర్వహించి సారా తయారీ, రవాణా చేయకుండా ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 207 మందికి ప్రభుత్వం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. దీంతో 16 గ్రామాల్లో మాత్రమే సారా ప్రభావం ఉందన్నారు. తరచూ వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయటం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. ఎన్నికల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రౌడీషీటర్లలో పరివర్తన వచ్చేలా కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై పీడీయాక్టు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. పోలీసుల కౌన్సెలింగ్ అనంతరం వారిలో మార్పు రాకపోతే బహిష్కరిస్తామన్నారు.

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

- సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



హర్యానాలో సహదేవుడి మృతదేహానికి ఆర్మీ అధికారుల గౌరవ వందనం



మృతి చెందిన జవాన్ (ఫైల్)

మాకవరపాలెం: గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి చెందారు. మండలంలోని గిడుతూరుకు చెందిన మట్ల సహదేవుడు(45) ఆర్మీలో హవాల్దార్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం హర్యానాలో పనిచేస్తున్న ఈయన గురువారం విధుల్లో ఉండగా గుండెపోటుతో మరణించారు. ఈ నేపథ్యంలో అక్కడే ఆర్మీ అధికారులు సైనిక లాంఛనాలు ముగించి భౌతిక కాయాన్ని స్వగ్రామం తరలించారు. ఈ మేరకు శుక్రవారం గిడుతూరులో సైనిక లాంఛనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

30,919 మందికి విద్యాదీవెన లబ్ధి



విద్యార్థులకు నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సత్యవతి

- తల్లుల ఖాతాల్లో రూ.20.33 కోట్లు జమ

తుమ్మపాల: జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకానికి సంబంధించి 30,919 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.20.33 కోట్ల నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేశారని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి ముఖ్యమంత్రి విద్యాదీవెన నాలుగో విడత ఆర్థిక సాయం అందించే కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్‌తోపాటు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి వీక్షించారు. అనంతరం విద్యార్థులకు నమూనా చెక్కును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరం నాలుగో త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెనలో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసేందుకు జిల్లాలో అర్హులైన 30,919 మంది విద్యార్థులకు రూ.20,33,16,588లు జమ చేశామన్నారు. పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులు చదివే పేద విద్యార్థుల చదువుకు కళాశాలల్లో చెల్లించాల్సిన ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ నగదును తల్లులు–విద్యార్థుల జాయింట్ అకౌంట్‌లో నేరుగా జమ చేస్తున్నామన్నారు. 25,036 మంది బీసీ, ఈబీసీ విద్యార్థులకు రూ.16,38,19,830లు, 2,063 మంది కాపు విద్యార్థులకు రూ.1,25,89,666లు, 3,625 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.2,54,82,318లు, 390 మంది మైనారిటీ విద్యార్థులకు రూ.28,49,548లు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ కె.రాజేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్‌బాబు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తీవ్ర విషాదం



శివరామకృష్ణ కుటుంబం (ఫైల్ ఫోటో)

- ఆర్థిక ఇబ్బందులు భరించలేక వ్యాపారి కుటుంబం ఆత్మహత్య
- సైనైడ్ కలిపిన బిర్యానీ తిని ప్రాణాలు విడిచిన దంపతులు, పిల్లలు
- నలుగురు మృతి.. ప్రాణాలతో బయటపడిన చిన్న కుమార్తె

పనులు పూర్తి చేసుకొని నాన్న ఇంటికొస్తే పిల్లలకు ఆనందం. భర్త కోసం ఎదురుచూసే గృహిణి మనసుకు నిశ్చింత. ఆయన వస్తూ వస్తూ తినడానికేమైనా తెస్తే పిల్లలు ఎగబడి తింటారు. ఈరోజూ అలాగే చేశారు. ఆయన బిర్యానీ తెస్తే అందరూ చక్కగా తిన్నారు. ముద్ద నోట్లో పెట్టే సరికి వారికి తెలీదు.. క్షణాల్లో ప్రాణం తీసే సైనైడ్ అందులో ఉందని. తెలుసుకునే లోగానే విగత జీవులయ్యారు.. తొమ్మిదేళ్ల పాపాయిని ఒంటరిగా ఒదిలేసి. తింటుండగా వాంతి కావడంతో ఆ చిన్నారి ప్రాణాలతో బయటపడింది.

సాక్షి, అనకాపల్లి/అనకాపల్లి: పట్టణంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధ తాళలేక నగల దుకాణ వ్యాపారి.. కుటుంబ సభ్యులతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిర్యానీలో సైనైడ్ కలిపి భార్య, ముగ్గురు పిల్లలతో తినిపించి బలవన్మరణానికి పాల్పడిన దుర్ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వీరిలో నలుగురు మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసులు చెప్పిన వివరాలు.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జ్యూయలరీ వ్యాపారి కొడవలి శివరామకృష్ణ తన కుటుంబంతో ఏడాదిన్నర క్రితం అనకాపల్లి వచ్చాడు. పెరుగుబజారు సమీపంలో బంగారు నగల దుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో స్వస్థలాన్ని వీడిన రామకృష్ణ (42) స్థానిక ఉడ్ పేటలో ఫైర్ స్టేషన్ పక్కన లక్ష్మి ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో భార్య మాధవి దేవి (35), కుమార్తెలు వైష్ణవి (15), జాహ్నవి (12), కుసుమ ప్రియ (9)లతో కలిసి నివాసముంటున్నాడు. తన పిల్లలను స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్లో చదివిస్తున్నాడు. పిల్లలు తొమ్మిది, ఏడు, మూడు తరగతులు చదువుతున్నారు. ఏడాదిన్నర నుంచి అనకాపల్లి టౌన్‌లోనే ఉన్నా వ్యాపార రీత్యాగానీ, పని నిమిత్తంగానీ ఎవరితో వివాదం పెట్టుకున్న సందర్భాలు లేవు. అయితే ఆ కుటుంబం చుట్టుపక్కల వారితో కలివిడిగా ఉండేవారు కాదని, ముభావంగా అంటీ ముట్టనట్టు ఒంటరిగా ఉండేవారని స్థానికులు తెలిపారు.

బిర్యానీలో సైనైడ్..

రామకృష్ణ గురువారం రాత్రి 9 గంటలకు దుకాణం నుంచి ఇంటికి వచ్చాడు. సైనైడ్ కలిపిన బిర్యానీ తీసుకొచ్చాడు. ఆ విషయం భార్య పిల్లలకు తెలీదు. కుటుంబమంతా బిర్యానీ తిన్నారు. అంతలో చిన్న కూతురు కుసుమ వాంతి చేసుకుంది. కొద్ది క్షణాల్లోనే మిగతావారంతా నేలకొరిగారు. ఈ విషయం గమనించిన కుసుమ పక్కింటికి వెళ్లి 'అమ్మ, నాన్న నిద్రపోయి లేవలేదు' అని ఏడుస్తూ చెప్పింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వాంతులు చేసుకున్న చిన్నారిని హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అనంతరం కేజీహెచ్‌కు తరలించారు.



చికిత్స పొందుతున్న కుసుమప్రియ

అప్పుల బాధ తాళలేకనే ఆత్మహత్య!

డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐ దాడి మోహన్‌రావు రాత్రి ఒంటి గంటకు సంఘటన స్థలానికి చేరుకుని తెనాలిలో నివసిస్తున్న శివరామకృష్ణ అన్నయ్య వెంకటేశ్వరరావుకు సమాచారం అందించారు. ఆయన శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు అనకాపల్లికి చేరుకున్న అనంతరం మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. రామకృష్ణ అప్పులు చేసి.. ఎవరికీ తెలియకుండా అనకాపల్లి టౌన్‌లో నివసిస్తున్నట్టు అతని సోదరుడు వెంకటేశ్వరరావు చెప్పిన వివరాల ప్రకారం తెలుస్తోంది. మూడు సంవత్సరాలుగా కుటుంబ సభ్యులతో సఖ్యత లేదని సమాచారం. మృతదేహాలను చూసేందుకు ఒక సోదరుడు మినహా కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదు. సంఘటన స్థలంలో ఆత్మహత్యకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించలేదని డీఎస్పీ వి.సుబ్బరాజు చెప్పారు. క్లూస్‌టీమ్ ఇంట్లో అన్ని గదులను క్షుణ్ణంగా పరిశీలించిందన్నారు. బిర్యానీ తిని అక్కడికక్కడే నాలుగురు మృతి చెందగా, కుసుమప్రియ అపాయం తప్పించుకుందని, ప్రస్తుతం కేజీహెచ్‌లో కోలుకుంటోందన్నారు. శివరామకృష్ణ అన్నయ్య వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దాడి మోహనరావు చెప్పారు.




లక్ష్మీప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో శివరామకృష్ణ, మాధవీదేవి, వైష్ణవి, జాహ్నవి మృతదేహాలు



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు

• వినూత్న స్వాగతం



నూతన సంవత్సర ఆగమనానికి ఇంకా రెండు రోజులు ఉండగానే ఆ చిన్నారుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. రానున్న సంవత్సరం 2024 ఆకారంలో నిల్చొని వినూత్న విన్యాసం చేశారు. కె.కోటపాడులోని ఒక ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఈ విన్యాసం చేసి అందరినీ ఆకట్టుకున్నారు.

- కె.కోటపాడు

క్లుప్తంగా

అంగన్‌వాడీ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం



నూతన కార్యవర్గం

నర్సీపట్నం: ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రొంగలి సత్య, ప్రధాన కార్యదర్శిగా నవర మణి, సహాయ కార్యదర్శులుగా కె.కృష్ణవేణి, వరలక్ష్మి, ఉపాధ్యక్షురాళ్లుగా గడమాల ఆశాజ్యోతి, శోభారాణి ఎన్నియ్యారు. ఉద్యోగాల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

పోలీసు గ్రీవెన్స్‌కు 13 అర్జీలు



ఎస్పీకి సమస్యను వివరిస్తున్న పోలీస్

అనకాపల్లి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బందికి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 13 మంది పోలీస్ సిబ్బంది వారి సమస్యలను తెలియజేసినట్లు ఎస్పీ కేవీ మురళీకృష్ణ చెప్పారు. అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి మిస్టరీని ఛేదించిన పోలీసులు

- రాణాలో గంజాయిని కాజేసిన వైనం
- 6 నెలల కిందట నుంచి పథకం
- ఎట్టకేలకు పట్టుబడిన నిందితులు
- 8 మంది అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

యలమంచిలి/యలమంచిలి రూరల్: పలు కేసుల్లో పట్టుబడ్డ గంజాయిని పోలీసుల కన్నుగప్పి మాయం చేశారు. ఇతర ప్రాంతాల్లో దీన్ని విక్రయించడానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పడిపోయిన బ్యాగు ఆధారంగా గంజాయి ముఠాను యలమంచిలి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వారి విచారణలో విస్తుగొలిపే వాస్తవాలు తెలుసుకుని నిర్ఘాంతపోయారు. ఈ కేసులో మొత్తం 8 మందిని అరెస్ట్ చేసినట్టు సీఐ గఫూర్ శుక్రవారం రాత్రి తెలిపారు. వివరాలివి... కొన్ని కేసుల్లో అనుమానితులుగా ఉన్న కొందరు యువకులను యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించిన క్రమంలో వారు స్టోర్ రూంలో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. పోలీస్ స్టేషన్ పక్కన, వెనుక భాగంలో నివాస గృహాలేవీ లేకపోవడంతో పట్టణానికి చెందిన ప్రగడ రవితేజ, దుర్గాసాయి, కార్తీక్ ఆర్నెల్ల కిందట గంజాయిని కాజేసేందుకు పథకం పన్నారు. ఈ మేరకు పట్టణానికి చెందిన రవితేజ, దుర్గాసాయి, కార్తీక్ రాత్రిళ్లు స్టేషన్ వెనుకవైపు స్టోర్ రూమ్ కిటికీ గ్రిల్స్ తొలగించి రెండు బస్తాల గంజాయిని పట్టుకుపోయారు. ఈ రెండు బస్తాలను నక్కపల్లికి చెందిన వెంకటేష్‌కు విక్రయించగా, అతను మరో ఇద్దరితో కలిసి విజయవాడలో విక్రయించేందుకు తరలిస్తుండగా ఆత్మకూరు పోలీసులకు పట్టుబడ్డారు. అక్కడ పోలీసులు ఆరా తీయగా, ఈ గంజాయిని తాము చింతపల్లి నుంచి కొనుగోలు చేసి తెస్తున్నట్టు చెప్పారు.



సోమన్నపాలెంలో గంజాయి బ్యాగు లభించిన ప్రాంతంలో విచారణ చేస్తున్న పోలీసులు (ఫైల్)

పట్టుబడింది ఇలా...

ఆ తర్వాత 15 రోజుల కిందట నిందితుడు రవితేజ తన సహచరులైన శీలంశెట్టి సాయి, పైరపు తేజ, గొర్లె కుసుమకుమార్, మరో ఇద్దరు మైనర్లతో కలిసి ఇటీవల అర్ధరాత్రి వేళ స్టేషన్ స్టోర్ రూమ్‌లో 8 గంజాయి బస్తాలను దొంగిలించారు. దీన్ని యలమంచిలి మండలం సోమన్నపాలెం రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో పాడుబడిన భవనంలో దాచారు. ఈ నెల 26న వాటిలో ఒక గంజాయి బ్యాగును విక్రయించేందుకు సిద్ధపడ్డారు. రవితేజ మరో వ్యక్తితో కలిసి బైక్‌పై గంజాయి బ్యాగును తీసుకెళ్తుండగా, బ్యాగు కిందపడిపోవడంతో దాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. యలమంచిలి రూరల్ పోలీసులు ఆ గంజాయి బ్యాగును స్వాధీనపర్చుకుని ప్రత్యేక బృందాలతో కేసు దర్యాప్తు చేసి, సాక్ష్యాధారాలు సేకరించారు. ఈ కేసుల్లో రవితేజ, దుర్గాసాయి, కార్తీక్, శీలంశెట్టి సాయి, పైరపు తేజ, గుర్లె కసుమ కుమార్ సహా వెంకటేష్, గణేష్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 310 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించినట్టు సీఐ గఫూర్ చెప్పారు. నిందితులకు న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో విశాఖ కేంద్ర కారాగారానికి తరలించామన్నారు.

మనసున్న మా రాజు జగనన్న

- బాధితురాలికి రూ.5 లక్షల చెక్కు అందజేసిన డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనసున్న మా రాజు అని, నిరుపేదల పాలిట ఆపద్బాంధువని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని చీడిపల్లిలో రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన వేచలపు దేవికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును శుక్రవారం ఆయన అందజేశారు. దేవి భర్త లక్ష్మణ(25) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. వృత్తి రీత్యా ఛత్తీస్‌గఢ్‌కు లోడ్‌కు వెళ్లగా, జూలైలో అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటికి అతడి భార్య దేవి ఐదు నెలల గర్భిణి కాగా, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఆమె ఆర్థిక ఇబ్బందులను సర్పంచ్ కసిరెడ్డి సూర్యనారాయణ, పార్టీ నాయకులు డిప్యూటీ సీఎంకు వివరించారు. దీనికి ఆయన స్పందించి సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సీఎం తన మానవత్వం చాటుకుని రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు బూడి తెలిపారు. మృతుడి కుమారుడికి ఐదేళ్లు నిండిన తర్వాత రెసిడెన్షియల్‌లో చేర్పిస్తానని అన్నివిధాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కసిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, పార్టీ నేతలు నందారపు రమణబాబు, పాతాళం చిన్నంనాయుడు, లాలం వెంకునాయుడు, బుగత వెంకటరమణ, ఘాటీలు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న బూడి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నక్కపల్లి: జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల చేసినందుకు కృతజ్ఞతగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ, తదితరులు మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ట్యూషన్, హాస్టల్ ఫీజులు చెల్లిస్తానని ఎన్నికల ముందు జగనన్న ప్రకటించారన్నారు.

ఆ మేరకు నాలుగేళ్లుగా నిరాటంకంగా అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాల సాయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఉమ్మడి ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. ఈ ఏడాదికి సంబంధించిన నిధులు జమ చేశారన్నారు.

కరోనా సంక్షోభ సమయంలోనూ సంక్షేమ పథకాలను కొనసాగించిన ఘనత జగనన్నదేనన్నారు. కార్యక్రమంలో వేంపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అయినంపూడి మణిరాజు, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, సర్పంచ్‌లు సాదిరెడ్డి శ్రీను, సురేష్ వర్మ, ఎంపీటీసీలు గొర్ల గోవిందు, పార్టీ నాయకులు మనబాల తాతారావు, దేశెట్టి నాగు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

ఎస్సీ, ఎస్టీలపై లైంగికదాడుల నిరోధానికి పటిష్ట చర్యలు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో ఎస్సీ ఎస్టీలపై ఎటువంటి లైంగికదాడులు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయనతోపాటు ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయంతోపాటు పరిహారం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. గత సమావేశంలో చర్చించిన విషయాలలో చాలా అంశాలను పరిష్కరించామన్నారు. కమిటీ సభ్యులు లేవనెత్తిన అంశాలపై తదుపరి సమావేశం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఆర్డీవోలు, డీఎస్పీలు మండల స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో పౌర హక్కుల దినోత్సవం గురించి విస్తృత అవగాహన పెంచాలన్నారు. సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి అజయ్‌బాబు, కమిటీ సభ్యులు డీహెచ్‌వో జి.ప్రభాకర్ రావు, వీఐపీఆర్వో కె.ఇంద్రావతి, డీపీవో ఆర్.శిరీషారాణి, ఆర్. మధుబాబు, ఎం. అప్పలరాజు, ఈశ్వరరావు బి.అప్పారావు, జె.తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి లక్ష పసుపు కొమ్ములతో అర్చన

కశింకోట: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మూడో శుక్రవారం పురస్కరించుకొని కశింకోటలో సిరుల తల్లి కనకమహాలక్ష్మికి లక్ష పసుపు కొమ్ములతో అర్చించారు. అమ్మవారిని పూలమాలలు, నూతన వస్త్రాలు, ఆభరణాలతో అందంగా అలంకరించి కుంకుమార్చన చేశారు. భక్తులు, ఉత్సవ నిర్వాహకులు సమర్పించిన లక్ష పసుపు కొమ్ములను వేద పండితులు, అర్చకులు అర్చించారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, ప్రతినిధులు వేగి వెంకటరావు, సూరిశెట్టి రేవతి, యల్లపు పార్వతి పాల్గొన్నారు.



బెంగళూరు వెళ్లేసరికి ఇల్లు గుల్ల

- ఏడున్నర తులాల బంగారం, 70 తులాల వెండి చోరీ



సంఘటనా స్థలంలో ప్రసాద్‌తో పట్టణ పోలీసులు

అనకాపల్లి: మండలంలో కొత్తూరు పంచాయతీ ఎన్జీవోస్ కాలనీలో ఏడున్నర తులాల బంగారం, 70 తులాల వెండి చోరీ జరిగినట్లు శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్ఐ సింహాచలం వివరాల మేరకు.. ఎన్జీవోస్ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వి.సత్యనారాయణప్రసాద్ ఈ నెల 15న కుటుంబ సమేతంగా బెంగళూర్‌లో పెద్ద కుమారుడు ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం ప్రసాద్ ఇంటికి పనిమనిషి వెళ్లి చూసేసరికి తలుపులు తీసి ఉన్నట్లు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న అతడు బెంగళూర్ నుంచి శుక్రవారం అనకాపల్లి చేరుకుని ఇంట్లో బంగారం, వెండి వస్తువులు పోయినట్లు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయాలి

- జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు

కె.కోటపాడు: వైద్య సిబ్బంది రోగులకు సంతృప్తికరమైన వైద్యం అందించడం ముఖ్యమని జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్(డీసీహెచ్ఎస్) శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడకు రోజూ వస్తున్న రోగుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోనే అధికంగా గర్భిణుల ప్రసవాలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేయడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమని వివరించాలని సూచించారు. కె.కోటపాడు ఆస్పత్రిలో నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు న్యూబోర్న్ చైల్డ్‌కేర్ యూనిట్ అందుబాటులో ఉన్నట్లు రోగులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారమే లక్ష్యం

- టాయ్ కమల పత్ర అవార్డు గ్రహీత డాక్టర్ స్వాతి



బెంగళూరులో టాయ్ కమల పత్ర అవార్డు అందుకుంటున్న డాక్టర్ స్వాతి

మాడుగుల రూరల్: ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్య పరిష్కారమే తన జీవిత లక్ష్యమని, ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నానని టాయ్ కమల పత్ర అవార్డు గ్రహీత ప్రొఫెసర్ డాక్టర్ పుట్టా స్వాతి తెలిపారు. చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన పుట్టా మల్లికార్జునరావు కుమార్తె స్వాతి ఈ నెల 27న బెంగళూరులో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ జాతీయ సదస్సులో టాయ్ కమల పత్ర అవార్డు పొందారు. ఏటా దేశంలో విశిష్టమైన సేవలందించిన పది విభాగాల వారికి ఈ అవార్డులు అందిస్తున్నారు. ఈ ఏడాది మెడికల్ విభాగంలో ఈమె జాతీయ అవార్డు అందుకున్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ చేసి ప్రస్తుతం విశాఖ రఘు ఫార్మసీ కళాశాలల్లో ఫార్మకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈమె ఇప్పటి వరకు వందకు పైగా పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఏడు పేటెంట్ హక్కులను పొందారు. ఎన్నో జాతీయ అవార్డులు పొందినామె తన పరిశోధనంతా డయాబెటిస్, కిడ్నీ, కేన్సర్ వ్యాధులు చేస్తున్నారు. తన పరిశోధనల వెనుక భర్త గణేష్ ప్రోత్సాహం ఎంతో ఉందని ఈ సందర్భంగా స్వాతి తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు నాబార్డు కృషి

- కొత్తకోటలో దుకాణ సముదాయం ప్రారంభోత్సవంలో డీజీఎం అబువరజాన్

రావికమతం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు నాబార్డు కృషి చేస్తోందని డీజీఎం అబువరజాన్ అన్నారు. కొత్తకోటలో నాబార్డు నుంచి రూ.15 లక్షలు, పంచాయతీ నుంచి రూ.5 లక్షలతో నిర్మించిన దుకాణ(మార్కెట్) సముదాయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పట్టణాల్లో, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఏటా రూ.2,500 కోట్లు నుంచి రూ.5 వేల కోట్లు వరకూ నిధులిస్తున్నామన్నారు. రోడ్లు, స్కూళ్ల అభివృద్ధితోపాటు ఇటువంటి మార్కెట్ సదుపాయాలు, గిడ్డంగులు, శీతలీకరణ గోదాముల నిర్మాణానికి సహాయ సహకారాలందిస్తామన్నారు. కొత్తకోట, చింతపల్లిలో గిరిజన వికాస్ సంస్థ ద్వారా రూ.30 లక్షలతో మార్కెట్ సముదాయాలు నిర్మించామన్నారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా దీనిని పంచాయతీ నిర్వహించుకోవాలన్నారు. ఒకప్పుడు విస్తరి కేంద్రమైన కొత్తకోటలో మార్కెటింగ్ ఎక్కువగా ఉంటుందన్నారు. ఇక్కడ త్వరలోనే శీతల గిడ్డంగి, సరుకు నిల్వ గోదాము ఏర్పాటుకు పరిశీలిస్తామన్నారు. సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా కోరిక మేరకు మార్కెట్‌కు ప్రహరీ నిర్మాణానికి నిధులిస్తామని హామీ ఇచ్చారు. ఏజీఎం సుమంత్‌కుమార్, ఎంపీపీ పైల రాజు, గిరిజన వికాస్ ఎన్జీవో సత్యనారాయణ, పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న అబువరజాన్, ఎంపీపీ రాజు

ఓవర్ లోడ్ లారీకి రూ.95 వేల ఫైన్

అనకాపల్లి: మండలంలో మార్టూరు నుంచి కోడూరు గ్రామం మీదుగా అధిక లోడుతో రాంబిల్లి వెళ్తున్న లారీపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ జి.భవ్యరెడ్డి తెలిపారు. గురువారం కోడూరు గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేయగా దీన్ని పట్టుకున్నామన్నారు. శుక్రవారం జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టరుకు అప్పగించగా, లారీ యజమాని కుంభ సుధాకర్‌కు అపరాధ రుసుంగా రూ.95,400 విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

లాభాల పూ'బంతి'

- బంతిపూల సాగుపై రైతుల ఆసక్తి
- అనకాపల్లి మండలంలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక ఆదాయం

బంతిపూల సాగు రైతులకు లాభసాటిగా మారి సిరులు కురిపిస్తోంది. పెరిగిన వాణిజ్య పంటల ఖర్చు, కూలీల కొరతతో విసిగిపోయిన వారు ఉద్యాన పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. అనకాపల్లి మండలంలోని మెట్ట ప్రాంతాల్లో బంతిపూల సాగు చేపడుతున్నారు. పండగ సీజన్లో పూల దిగుబడి వచ్చేలా రైతులు బంతి, కనకాంబరాలు, చామంతి మొదలైన వాటిని సాగు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్లో రైతులు బంతి సాగు చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు.



సుందరయ్యపేటలో సాగులో ఉన్న బంతిపూల తోట



ఓ మహిళా రైతు సాగుచేసిన తోటలో విరగ పూసిన బంతిపూలు

అనకాపల్లి(యలమంచిలి రూరల్) : అనకాపల్లి మండలం సుందరయ్యపేట, వెంకుపాలెం, సీతానగరం తదితర గ్రామాలతో పాటు అనకాపల్లి పట్టణానికి సమీపంలో సుమారు 50 ఎకరాల్లో రైతులు బంతిపూల తోటలు సాగు చేస్తున్నారు. ఎకరం బంతి సాగుకు 12 వేల మొక్కలు అవసరమవుతాయి. ఒక్కో మొక్క రూ.3 చొప్పున దగ్గరలోని నర్సరీలో కొనుగోలు చేసి, నాటుతున్నారు.

ఎకరాకు రూ.లక్ష వ్యయం

ఎకరానికి విస్తీర్ణంలో బంతిపూల మొక్కలు నాటేందుకు రూ.36 వేలు ఖర్చవుతోంది. ఎకరాకు 4 ట్రాక్టర్ల సేంద్రియ ఎరువు వేసి, తర్వాత పొలాన్ని కలియదున్ని మొక్కలను నాటుతున్నారు. పొలం దున్నడం, కూలీలు, ఎరువులు, రసాయన మందులు, కౌలు ఖర్చుతో కలిపి ఎకరాకు రూ.50 వేలు నుంచి రూ.60 వేలు పెట్టుబడి అవుతోంది. దీంతో అన్ని ఖర్చులు కలిపి ఎకరాకు రూ.లక్ష వరకు వెచ్చించాలి. మొక్క నాటిన నెల రోజుల నుంచి పూలు పూస్తాయి. ఎకరాకు 100 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని రైతులు చెప్తున్నారు.

ఈ సీజన్లో ఆదాయం బాగు

క్వింటా బంతి రూ.5 వేలు నుంచి రూ.7 వేలు వరకు ధర పలుకుతోంది. కార్తీక మాసం, మార్గశిర మాసాలతో పాటు ఈ సీజన్లో అయ్యప్ప స్వాముల పడి పూజలు, భవానీ భక్తుల పూజలకు విరివిగా బంతి పూలను వాడడంతో అధిక ధర లభిస్తోందని, దీంతో మరింత లాభసాటిగా ఉంటోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి, పూజలు, శుభకార్యం ఏదైనా అలంకరణకు బంతి పూలు తప్పనిసరి. ఇటీవలి కాలంలో ప్రజలకు అలంకరణపై మక్కువ పెరగడంతో ఖర్చుకు వెనుకాడట్లేదు. ఈ నేపథ్యంలో బంతి పూల రైతులకు కాసుల వర్షం కురుస్తోంది. భారీ వర్షాలు, పెనుగాలులు లేకుండా వాతావరణం సహకరిస్తే ఎకరాకు రూ.4 లక్షలు వరకూ ఆదాయం వస్తోందని, పెట్టుబడి పోను రూ. 2.50 లక్షల వరకూ లాభం ఉంటోందని సాగు రైతులు పేర్కొంటున్నారు. ఏడాది కాలంలో 2 నుంచి 3 పర్యాయాలు బంతిపూల సాగు చేయవచ్చని చెబుతున్నారు.

లాభసాటిగా ఉంది



బంతిసాగు లాభసాటిగా ఉంది. ఒక ఎకరంలో బంతి సాగు చేపట్టాను. ప్రస్తుత సీజన్లో బంతిపూలు చేతికొచ్చాయి. కేజీ రూ.100కు అమ్ముతున్నాను. హోల్ సేల్ వ్యాపారులైతే కేజీ రూ.60 నుంచి రూ.70కి కొంటున్నారు. పూలు కోత దశలో ఉన్నాయి.

– బాదపు నాగ అప్పలనర్స, మహిళా రైతు, సుందరయ్యపేట

తక్కువ పెట్టుబడితో సాగు



తక్కువ పెట్టుబడితో బంతిపూల సాగు చేస్తున్నాను. గతంలో వాణిజ్య పంటలైన మిర్చి సాగుకి అధిక పెట్టుబడి అయ్యేది. కూలీల కొరత, రసాయనాల వినియోగంతో తీవ్రంగా నష్టపోయాను. బంతిపూల సాగు అనుకూలంగా ఉంటోంది. నిఖరాదాయం వస్తోంది.

– మాడెపు వెంకయ్యమ్మ, మహిళా రైతు, సుందరయ్యపేట

క్లుప్తంగా

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



సంతోషిమాత సన్నిధిలో దాడి రత్నాకర్, స్థానిక నాయకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శ్రీ సంతోషిమాత అమ్మవారి ఆలయ 47వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు 24 గంటల ఏకాహం ప్రారంభించారు. జై సంతోషిమాత జై అంటూ భజన చేశారు. కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, ఆలయ అర్చకులు సరిపల్లి కామేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పీఎస్‌కే నాయుడు, పెతకంశెట్టి శ్రీనివాస్, విల్లూరి ప్రసాద్, కాండ్రేగుల సాంబ, చదరం వెంకటరావు, కొణతాల లక్ష్మీ, సంధ్య, దాడి లక్ష్మీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత ప్రయాణం వద్దు.. రాయితీ ఇవ్వండి'



సమావేశంలో మాట్లాడుతున్న కాండ్రేగుల అప్పారావు

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు మహిళలకు ఆర్టీసీ బస్‌లలో ఉచిత ప్రయాణం కంటే టికెట్‌లో 50 శాతం రాయితీ ఇవ్వాలని గ్రామీణ వయోవృద్ధుల ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు కోరారు. గవరపాలెం పార్కుసెంటర్ సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.
65 ఏళ్లు దాటిన వ్యక్తులకు మాత్రమే బస్ ప్రయాణంలో ఉచిత సౌకర్యం కల్పించాలన్నారు. ఉచిత ప్రయాణాలతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎంఎస్ఎస్ అప్పారావు, సాంబమూర్తి, అచార్యులు, ఆడారి అప్పారావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 4,699 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,400	4,810
మొదటి రకం	4,000	4,620
రెండో రకం	3,780	4,210
మూడోరకం	3,500	3,750

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	రాజా
ఉమాపతి	సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ)	సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	షిర్డిసాయి
సలార్	పర్తిసాయి
మంగళవారం	వెంకటేశ్వర
తికమక తాండ	శ్రీసత్య
సలార్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 69 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-17 యూనిట్లు, ఓ పాజిటివ్-36 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

కనకదుర్గమ్మకు ఉయ్యాల సేవ



కనకదుర్గ అమ్మవారి ఉయ్యాల సేవలో కాండ్రేగుల శ్రీరామ్ దంపతులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గంగపరదేశమ్మ భవానీ భక్తుల ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారి చండీయాగ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా శుక్రవారం అమ్మవారికి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీరామ్ దంపతులు ఉయ్యాలసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా అమ్మవారికి వివిధ రూపాల్లో పూజలు జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దాల శ్రీను, కె.సుబ్బు, వెంకట్, వర, మహేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులకు తుది గడువు రేపు

అనకాపల్లి: జీవీఎంసీ జోన్ పరిధిలో చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీస్థలాలు, కుళాయి పన్నులను నెలాఖరులోగా చెల్లించాలని, లేనిపక్షంలో అపరాధ రుసం, చట్ట ప్రకారం జప్తుచేయనున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పన్నులను సకాలంలో చెల్లించి, జోన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆన్‌లైన్‌తోపాటు, సచివాలయం, జోనల్ కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చన్నారు.

తాతబాబు కుటుంబానికి రూ.3 లక్షల సాయం

తాడేపల్లిలో అందించిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల భార్గవ్

కశింకోట: ఇటీవల మరణించిన వైఎస్సార్‌సీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్ భీముని తాతబాబు కుటుంబానికి పార్టీ తరఫున రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా జిల్లా కన్వీనర్ కోరాడ చందుయాదవ్ వివరాలను వెల్లడించారు. తాతబాబు సెప్టెంబర్ నెలలో అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఈ విషయాన్ని పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల భార్గవ్‌కు తెలుపగా ఆయన వెంటనే స్పందించారు. తాతబాబు కుటుంబానికి ఆర్థిక భరోసా కలిగించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం ఆదేశాల మేరకు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యాలయంలో తాతబాబు కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ముఖ్యమంత్రి అండగా ఉన్నారని, తమ సంపూర్ణ సహకారం ఉంటుందని భరోసానిస్తూ, రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. ఏ సహాయం కావాలన్నా తనను సంప్రదించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ సూరంపూడి శ్రీకాంత్, అనకాపల్లి నియోజకవర్గ కో కన్వీనర్ రాయి రాజ, పెందుర్తి కో-కన్వీనర్ నక్కా కిషోర్ పాల్గొన్నారు.



తాతబాబు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సజ్జల భార్గవ్

పరవాడపాలెం సమస్యల పరిష్కారానికి కృషి

కశింకోట: మండలంలోని పరవాడపాలెం ప్రాథమిక పాఠశాలలో తన సొంత ఖర్చుతో పలు సౌకర్యాలు కల్పిస్తానని వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. పరవాడపాలెంలో ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో అవసరమైన టేబుల్స్, ఫ్యాన్లు, లైట్లను సమకూరుస్తానన్నారు. శ్లాబ్ స్థాయిలో నిలిచిపోయిన భవనానికి గచ్చులు వేయించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని స్కూలోని ఖాళీ గదిలోకి మార్చి, అవసరమైన 4 ఫ్యాన్లు, లైట్లు తన సొంత ఖర్చుతో సమకూరుస్తానన్నారు. శ్రీకృష్ణ మందిరానికి ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తానన్నారు. షెడ్లలో నివసిస్తున్న కుటుంబాలను కలిసి పక్కా గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు సాయం చేస్తుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్ఎం త్రినాథకుమారి, స్కూల్ కమిటీ చైర్మన్ భర్నికాన రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగి దొరబాబు, గ్రామ నాయకులు బలిజ ముసిలి నాయుడు, గొంతిన లోవ అప్పారావు, బెజవాడ రాజు, కోయిలాడ నాగు తదితరులు పాల్గొన్నారు.



పరవాడపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న దాడి రత్నాకర్

ఆడుదాం ఆంధ్రా.. ఊరూ వాడా హోరెత్తేలా

గ్రామీణ క్రీడాకారుల్ని ప్రోత్సహించాలి. మట్టిలో మాణిక్యాల్ని వెలికి తీసి, వారి ప్రతిభను లోకానికి పరిచయం చేయాలి. ప్రపంచ క్రీడారంగంలో రాష్ట్రం తరఫున రాణించేలా తోడ్పాటునందించాలి. అదే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా.. క్రీడా పోటీల ఉత్సాహంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు ఐదు అంశాల్లో గ్రామ/వార్డు స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు హోరెత్తించారు.



కశింకోట బాలికల హైస్కూల్లో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



బయ్యవరం హైస్కూల్లో ఖోఖో పోటీల్లో క్రీడాకారులు

కశింకోట: స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా నాలుగో రోజు క్రీడలు ఉత్సాహంగా కొనసాగాయి. షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు నాలుగు సచివాలయాల నుంచి 27 జట్లు పాల్గొన్నాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పోటీల్లో ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించి, గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. పీడీలు వి.ప్రభాకరరావు, పెంటకోట కమల, పంచాయతీ కార్యదర్శి రమేష్‌ల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.

- బయ్యవరంలో కూడా ఖోఖో పోటీలు నిర్వహించారు. మూడు జట్లు పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నాయి. పీడీ కృష్ణ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.
- తాళ్లపాలెం హైస్కూల్లో ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సత్యారావు, పీడీ గోవిందరావుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి, విజేతలను ఎంపిక చేశారు.

విద్యార్థుల్లో స్ఫూర్తిని పెంచుతున్నాయి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా.. కార్యక్రమం విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతోంది. వారిలో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతోంది. ఈ నెల 26 నుంచి కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రభుత్వం గ్రామ/వార్డు స్థాయి పోటీలను నిర్వహిస్తుండటం తెలిసిందే. వీటిని చాలా వరకు పాఠశాలల మైదానాల్లోనే నిర్వహిస్తున్నారు. వీటిని చూస్తున్న విద్యార్థులు తాము కూడా ఆటలు ఆడేందుకు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. 15 ఏళ్లు పైబడిన బాల బాలికలు, యువతీ యువకులు మాత్రమే ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. పాఠశాల విద్యార్థులకు అవకాశం లేదు. దీంతో ఈ ఆటల్ని చూస్తూ, ప్రోత్సాహాన్ని పొందుతున్నారు. వీరి ఉత్సాహాన్ని మరింత పెంచేలా పాఠశాలల్లోనే పీడీలు, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులు డ్రిల్ పీరియడ్‌లో షటిల్ బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ ఆడారు. ఇతర విద్యార్థులు పోటీలను ఆసక్తిగా తిలకించారు. పీడీ గోవిందరావు పోటీలను పర్యవేక్షించారు.



తాళ్లపాలెం హైస్కూల్లో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



షటిల్ బ్యాడ్మింటన్ ఆటలో బాలికలు



మైదానంలో విద్యార్థుల సందడి

సమగ్రశిక్ష ఉద్యోగుల వంటా వార్పు

అనకాపల్లి: తమన్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తట్టా కృష్ణ అన్నారు. సమ్మెలో భాగంగా జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాక డీఈవో కార్యాలయం వద్ద శుక్రవారం వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజులుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్చి, మినిమం టైం స్కేల్ వర్తించాలని, వేతనాలు పెంపు తదితర డిమాండ్లతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పూడి వెంకట్రావు, పట్నాల సతీష్, ఉపాధ్యక్షుడు సీహెచ్ రామచంద్రరావు, సభ్యులు నాగేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం వద్ద వంటా వార్పులో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం

అంగన్‌వాడీల రిలే దీక్షలు

అనకాపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానం వద్ద అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌ల ద్వారా పనిభారాన్ని తగ్గించాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం, విధుల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణ్, సీఐటీయూ డివిజన్ నాయకుడు గంటా శ్రీరామ్, అంగన్‌వాడీ ఉద్యోగులు కాసులమ్మ, దేవి, లక్ష్మీ, తులసి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ క్రీడామైదానం వద్ద రిలే దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీ ఉద్యోగులు

వ్యవసాయ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సలహా సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించాలని, అదే విధంగా విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో కనెక్షన్ మంజూరు చేయాలని సూచించారు. పొలాల్లో వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను సరి చేయాలని, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చడంతో పాటు లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోరారు. ఏఈ అశోక్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో రైతులకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న గ్రీవెన్స్ వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ఈపీడీసీఎల్ ఏఈలు అశోక్, వీరేంద్ర, నాయకులు బోకం రామునాయుడు, సలహా కమిటీ సభ్యులు కోట్ని అమ్మతల్లి నాయుడు. వెన్నల శ్రీరాములనాయుడు, కోరుబిల్లి నూకరాజు, బోను గంగునాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

ఆకట్టుకున్న గణిత నమూనాలు



వెదురుపర్తి హైస్కూల్లో గణిత నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నమూనాలతో గణిత అంశాలను వివరిస్తున్న విద్యార్థులు

కశింకోట: గణితశాస్త్ర పక్షోత్సవాల సందర్భంగా మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు గణిత నమూనాలు ప్రదర్శించారు. త్రికోణమితి, సాంఖ్యక శాస్త్రం, జ్యామితి, బీజ గణితం తదితర కఠిన అంశాలపై రూపొందించిన 60 నమూనాలు విద్యార్థుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీటి సాయంతో గణిత శాస్త్రంలో మెలకువల్ని సహ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జీవీకే ఆచారి మాట్లాడుతూ నమూనాల సాయంతో విద్యా బోధన చేస్తే గణితం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందన్నారు. నమూనాల తయారీలో సృజనాత్మకత, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన గణిత ఉపాధ్యాయులు ఏవీఎస్ మూర్తి, పీవీఎస్ఎన్ మూర్తిలను అభినందించారు.

పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలి

తుమ్మపాల: పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల జీతాలు తక్షణం చెల్లించాలని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ కార్మికులకు మూడు నుంచి ఆరు నెలల జీతం బకాయిలు ఉన్నాయన్నారు. సంక్రాంతి పండగకు కూడా జీతాలు రాకపోతే వారి కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ప్రతినిధులు చిన్నారావు, అప్పారావు పాల్గొన్నారు.

పురుగుల మందు సేవించి యువకుడి ఆత్మహత్య

అనకాపల్లి: మండలంలో తుమ్మపాలకు చెందిన గాలి చిరంజీవి(28) క్రిమిసంహారక(పురుగుల) మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు వివరాల మేరకు... అచ్యుతాపురం ప్రైవేట్ కంపెనీలో ఎగ్జిక్యూటీవ్‌గా పనిచేస్తున్న అతడు సీహెచ్ఎన్ అగ్రహారం సమీపంలో క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

పరవాడ: మండలంలో వెన్నలపాలెం గ్రామంలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గ్రామ సమైక్య సంఘ ప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. గ్రామ సమైక్య సంఘాల ఆధ్వర్యంలో 0.20 సెంట్ల స్థలంలో ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలు, ఇతర పంటలు సాగు చేయడం ద్వారా నెలకు రూ.10 వేల ఆదాయం సమకూర్చుకోవడానికి వీలవుతుందని మండల సమైక్య అధ్యక్షురాలు చుక్క సత్యవతి సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై సంఘ సభ్యులు అవగాహన పెంపొందించుకోవాలనే క్షేత్ర స్థాయి పరిశీలన చేసినట్టు చెప్పారు. ఈ విధానంలో సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. క్షేత్ర పరిశీలనలో మహిళా సమైక్య ట్రెజరర్ మాధవీ ప్రసన్న, డివిజినల్ ఇన్‌చార్జి ఎం.వెంకటలక్ష్మి, మోడల్ మేకర్ డి.మహాలక్ష్మి, పి.సంతోష్, బలరామ, రామలక్ష్మి పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

సబ్బవరం: ఆనందపురం-అనకాపల్లి హైవేపై బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. సీఐ రంగనాథం శుక్రవారం తెలిపిన వివరాలు. అనకాపల్లి, కోడూరుకు చెందిన చిట్టి ప్రసాద్ తన సోదరుడితో కలిసి ద్విచక్రవాహనంపై సబ్బవరంలోని బాటజంగాలపాలెం వస్తున్నారు. టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీ కొట్టింది. ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా అతని సోదరునికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.